క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నూతన ఎంపీడీఓగా ఎం.ఉమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎంపీడీఓల బదిలీలలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఇంచార్జీ ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉమాదేవి బదిలీపై స్టేషన్ ఘన్‌పూర్ రెగ్యులర్ ఎంపీడీఓగా వచ్చారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించగా మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చిల్పూరు ఎంపీడీఓగా బర్మావత్ శంకర్

చిల్పూరు: మండల ఎంపీడీఓగా బర్మావత్ శంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీఓ మధుసూదన్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, టీఏ సింగపురం కిరణ్‌లతో కలిసి కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాయానికి వెళ్లి తహసీల్దార్ సరస్వతి, డీటీ విమల, ఆర్‌ఐ శ్రీనివాస్‌ను కలిశారు.

పాలకుర్తి ఎంపీడీఓగా రాములు

పాలకుర్తి: పాలకుర్తి ఎంపీడీఓగా ఆవుల రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకుర్తి ఎంపీడీఓగా పని చేసిన వనపర్తి అశోక్‌కుమార్ ఖమ్మం జిల్లాకు బదిలి కాగా, యాదాద్రి భవనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం ఎంపీడీఓగా పని చేసిన రాములు పాలకుర్తి ఎంపీడీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తరిగొప్పుల ఎస్సైగా శ్వేత

తరిగొప్పుల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండల నూతన ఎస్సైగా శ్వేత బుధవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. గతంలో గీసుకొండ ఎస్సైగా విధులను నిర్వహించి బదిలీపై ఇక్కడకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ పడేది లేదని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని అన్నారు. మండల ప్రజలకు ఏమైనా సమస్యలు వస్తే మధ్య దళారులను ఆశ్రయించకూడదని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని తెలిపారు.

నియామకం

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, పద్మశాలీ సంఘం జిల్లా నాయకుడు చింతకింది కృష్ణమూర్తి జిల్లా బీసీ రాజ్యాధికార సమితి ప్రచార కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ మేరకు ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు దాసు సురేష్ బుధవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీల బతుకులు మారడం లేదని.. రాజ్యాధికారంతోనే బాగుపడుతామన్నారు. అందుకు రాజ్యాధికారం కోసం బీసీలందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. బీసీల ఐక్యత, రాజ్యాధికారం కోసం జిల్లా వ్యాప్తంగా మండల కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో నియామకం చేసిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధ్యక్షుడు దాసు సురేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లంబాడీ ఐక్య వేదిక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రవీందర్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని చంద్రుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాన్‌సింగ్‌తండాకు చెందిన భూక్య రవీందర్‌ను లంబాడీ ఐక్య వేదిక అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయక్‌జాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రవీందర్ ఘన్‌పూర్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ లంబాడ ఐక్య వేదిక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియామకం కావడం సంతోషంగా ఉందని, తనపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి, సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టిస్టు ప్రకాష్‌కు గోల్డ్‌మెడల్



దేవరుప్పుల: ఏ రంగంలోనైనా ఉన్నత విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌తోపాటు ఉత్తమ పురస్కారాలు అందుతాయన్న ఆచరణాత్మకతకు అద్దం పట్టేలా ఆర్ట్స్‌లో వికసించిన గుండె ప్రకాష్‌కు బుధవారం హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీచే గోల్డ్‌మెడల్ లభించింది. మండలంలోని కామారెడ్డిగూడేనికు చెందిన గుండె ప్రకాష్ ఇంటర్ పూర్తిచేసి జెఎన్‌టీయూలో ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో గ్రాడ్యుయేషన్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలోనే తనలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే ప్రయత్నం చేశాడు. ఐతే హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ ఆవరణలో 83వ ఆల్ ఇండియా ఆర్ట్స్ ఎగ్జిబిషన్ 2024లో దేశవ్యాప్తంగా ఆరు వేల విభాగాల్లో పోటీ ప్రదర్శనకుగానూ 600 ప్రదర్శనలు ఫైనల్‌కు చేరాయి. ఇందులో గుండె ప్రకాష్‌కు సామాజిక రుగ్మత అంశంగా హైదరాబాద్ 7 నంబరు చౌరస్తాలో బాలుడిపై వీధి కుక్కల దాడి ఘటనపై చిత్రించిన ప్రదర్శనకు అత్యుత్తమ ప్రతిభకు ఎంపికైంది. ఈ ప్రతిభకుగానూ సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం రాత్రి గోల్డ్‌మెడల్, ప్రశంసపత్రాన్ని పొందారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు

జనగామ: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌తో పాటు సహస్రకిడ్స్, గౌతమ్ స్కూల్, భవనీనగర్ శ్రీ సరస్వతీ మాతా ఆలయంలో బుధవారం వసంతి పంచమి వేడుకలను పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్‌లో వేద పండితులు వెంకటేశ్వర్లశర్మ మంత్రోచ్ఛరణల మధ్య 50 మందికి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలనర్సయ్య, చింతకింది కృష్ణమూర్తి, పాఠశాల అధ్యక్షుడు బుస్సా సిద్ధేశ్వర్, కార్యదర్శి జైన రమేష్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, చంద్రశేఖర్, బచ్చు బాల్‌నారాయణ, గునిగంటి రామకృష్ణ, అభిషేక్ గుప్త, టీచర్లు కొత్తపల్లి స్వప్న, కృష్ణవేణి, అర్చన, శిరీష, పర్వీన్ ఉన్నారు. కార్యక్రమంలో గౌతమ్ మోడల్ స్కూల్‌లో పాఠశాల యాజమాన్యం మోతె సురేందర్‌రెడ్డి పద్మ ఆధ్వర్యంలో హెచ్‌ఎం అమ్మద్ పాషా, శ్వేత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.



జనగామ: సహస్ర కిడ్స్‌లో..



జనగామ: గౌతమ్ మోడల్ స్కూల్‌లో..



జనగామ: సరస్వతి శిశుమందిర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

గ్రామాల్లో మండమెలిగె పూజలు

చిల్పూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా మండమెలిగె ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే లింగంపల్లి జాతరలో ఈఓ చిందంవంశి, కుర్రెంల మోహన్, రాజేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ కండ్లకోలు బాలరాజు, వైస్ చైర్మన్ రావులపల్లి వెంకన్న ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కొండాపూర్-శ్రీపతిపల్లి గ్రామాల సరిహద్దులో జరిగే జాతరలో భాగంగా చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట రాజుల ఆధ్వర్యంలో భక్తులు బోనాలతో వెళ్లి పూజలు చేశారు. చిల్పూరు మబ్బుగుట్ట జాతర సందర్భంగా చైర్మన్ బొల్ల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, శివరాత్రి సారయ్య, ఐలోని, పల్లెపు రాజు, దండిగ లింగయ్య, ఆవుల లింగయ్య, ముప్పారం కుమార్, సంపత్, గనగోని నవీన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, చైర్మన్ బొల్ల రాజ్‌కుమార్ అన్నదానం చేశారు.



శ్రీపతిపల్లిలో బోనాలతో వెళ్తున్న భక్తులు



లింగంపల్లిలో గద్దెల వద్ద బంగారంతో భక్తులు

గ్రామీణ క్రీడల్లో సీజేఐటీ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో సీజేఐటీ కళాశాల డైరెక్టర్

జనగామ: ఇటీవల మాతృదర్శన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో కళా క్రీడ-2024 గ్రామీణ క్రీడా పోటీల్లో జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బీటెక్ విద్యార్థులు కబడ్డీలో అద్భుతంగా రాణించి విజేతలుగా నిలిచినట్లు కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి తెలిపారు. విజేతలుగా నిలిచిన కళాశాల విద్యార్థులు రోహన్‌కుమార్, రాజు, సునిత్, అజయ్, ప్రశాంత్, సాయిరాం, నిజాముద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ అరలాండ్‌రెడ్డిని డైరెక్టర్ విజయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

ఐదోరోజుకు చేరిన నిరసన దీక్షలు

జనగామ: జనగామలోని పేదలకు ప్లాట్లు విక్రయించి స్థలాలు చూపించకుండా మోసం చేసిన మోహన్‌రావు, ఈశ్వర్‌రావు ఇద్దరిపై కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం చేయాలని పోరాట సంఘం అధ్యక్షులు భిక్షపతి డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ.. తలపెట్టిన నిరసన దీక్షలు బుధవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. భిక్షపతి మాట్లాడుతూ బాధితులకు వెంటనే ప్లాట్లు అప్పగించకపోతే ఈశ్వరరావు, మోహన్‌రావు ఇంటి ఎదుట దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిద్ది రాములు, సోముల శ్రీశైలం, గౌరిగే మధు, వెంకన్న, ఏగుర్ల మీనయ్య, మార్క సంతోశ్, మరాఠి చంద్రయ్య, మంగ శంకర్, గౌరిగే రాజు ఉన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

చిల్పూరు: గ్రామం నుంచి మట్టిని అక్రమంగా ఎవరైనా తరలిస్తే గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎంపీఓ, గ్రామ ప్రత్యేకాధికారి మధుసూదన్ హెచ్చరించారు. మండలంలోని నష్కల్ గ్రామంలో బుధవారం మట్టి అక్రమంగా తవ్వకాలు, తరలింపుపై ప్రత్యేక గ్రామసభను పంచాయతీ కార్యదర్శి స్నేహ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, బీజేపీ నాయకుడు గంటె ఉపేందర్ యాదవ్ సభకు వచ్చిన ప్రజల సమక్షంలో పంచాయతీ తీర్మానం చేయాలని కోరారు. కాగా, ప్రత్యేకాధి ఆదేశాలతో తీర్మానం చేసి చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తే వాహనాలతో పాటు యజమానులపై కేసులు నమోదు చేయిస్తామన్నారు.



తీర్మాన పత్రాన్ని చదువుతున్న కార్యదర్శి స్నేహ

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జనగామ: స్వచ్ఛంద సంస్థల సహకారం, శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకొంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని జనగామ యూనియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ కోరారు. బుధవారం వడ్లకొండ గ్రామంలో శ్రీకల్ప సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు శ్రీకల్ప గార్మెంట్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా మహిళలకు ఇది మంచి అవకాశంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ వ్యవస్థాపకులు ఆలేటి కల్పలత, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

సేవాలాల్ ఉత్సవ కమిటీ ఎన్నిక



సేవాలాల్ ఉత్సవ కమిటీ

జనగామ: జనగామ నియోజకవర్గంలో సేవాలాల్ జయంతి వేడుకల నిర్వహణ కోసం సేవాలాల్ ఉత్సవ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. 20వ తేదీన జనగామలో జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుని ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మూడు లక్ష్మణ్‌నాయక్, అధ్యక్షులుగా వాంకుడోత్ అనిత, ప్రధాన కార్యదర్శిగా ధర్మభిక్షం, ఉపాధ్యక్షుడిగా భూక్యా చందు, కోశాధికారిగా బానోత్ రవి నాయక్, సభ్యులుగా కొర్ర రాజేందర్, కాల్‌రాం, లకావత్ నరేష్, కిరణ్, రంగయ్య, శంకర్, వాసు నాయక్, హరిలాల్‌నాయక్, లచ్చిరాం, మీత్యానాయక్, భిక్షపతి, రఘు, హరిచంద్‌లు ఎన్నికయ్యారు.

చీరల పంపిణీ

కొడకండ్ల: మండలంలోని మహిళలకు సమ్మక్క-సారలమ్మ పండుగ కానుకగా హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేపట్టినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ తెలిపారు. బుధవారం మైదంచెరువుతండా గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

జనగామ: జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై 2019 ఫిబ్రవరి 14న భారత భద్రత బలగాల కాన్వాయ్‌పై జరిపిన ఉగ్ర దాడిలో అమరులైన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లకు బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, అమర జవాన్లకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంతెన మని, చుంచు శ్రీకాంత్, భీమ్ రాజు, వెంకట్, శివతో పాటు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బాధ్యులు

పలకల అందజేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని అంజయ్య నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేకపూజలను నిర్వహించారు. శివభక్త మార్కండేయ స్వామి ఆలయ పూజారి ఘనపురం ఆనంద్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా దాత ముద్దసాని నవ్యాఅనీల్ అందించిన పలుకలను పిల్లలకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, అంగన్‌వాడీ టీచర్ ఘనపురం కవిత, ఆయా రాజేశ్వరి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నర్మెట: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నర్మెట: పేదల సంక్షేమం, మహిళా సాధికారత, అంతర్గత, బాహ్య భద్రత, సాంస్కృతిక పునరుద్ధరణ, విదేశాల్లో దేశ గౌరవాన్ని పెంచడం వంటి పలు రంగాల అసాధరణ అభివృద్ధి ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీతోనే సాధ్యపడిందని గావ్ చలో అభియాన్ మండల కోఆర్డినేటర్ బిచ్చాల కొంరెల్లి అన్నారు. అమ్మాపురంలో కేంద్ర పథకాలను ఇంటింటికి వివరిస్తూ కరపత్రాలను పార్టీ శ్రేణులతో కలసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీసీరోడ్లు, పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, రైతు వేదికలు, అంగన్‌వాడీలు, పౌష్టికాహారాలు, వీధి దీపాలు, 50 శాతం సబ్సిడికే రైతులకు ఎరువులు, ఉచిత రేషన్ బియ్యం, గ్రామ పంచాయతీలకు 90 శాతం నిధులు, క్రీడా ప్రాంగణాలు కేంద్రప్రభుత్వ నిధులతోనే ఏర్పాటు చేశారని అన్నారు. కాగా, గ్రామంలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేవని, అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని, పేదలకు ఇంటి సౌకర్యం కల్పించాలని, రేషన్ కార్డులు ఇప్పించాలని, దళితవాడలో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలని పలువురు కోరారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు మేకల బాలచందర్, ఇర్రి చంద్రారెడ్డి, కుంటి శ్రీధర్, ఎర్ర భాస్కర్, ఎర్రబోతుల బన్ని, కుంటి మోహన్, సాయికుమార్, కార్తిక్, విజయ్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అబ్దుల్ రహీం

స్టేషన్‌ఘన్‌పూర్: బ్యాంకు సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ వరంగల్ ఆర్‌ఎం, ఆర్‌బీఓ(రీజినల్ బిజినెస్ ఆఫీసర్) అబ్దుల్ రహీమ్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో బుధవారం ఎస్‌బీఐ స్టేషన్‌ఘన్‌పూర్ బ్రాంచి వారి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రాప్‌లోన్స్, వ్యక్తిగత రుణాలు ఎప్పటికప్పుడు చెల్లించాలని, బకాయిలు ఎక్కువగా పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఎస్‌బీఐ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుంటూ బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఘన్‌పూర్ ఎస్‌బీఐ మేనేజర్ శేఖర్‌బాబు, ఫీల్డ్ ఆఫీసర్ కట్టస్వామి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు యాదగిరి, సీఎస్‌పీ జోగు వసంత, కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క-సారలమ్మ జాతర విజయవంతానికి అందరూ బాధ్యతగా పనిచేయాలని సీఐ ముస్క రాజు, ఈఓ లక్ష్మీప్రసన్న, జాతర కమిటీ బాధ్యుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మందపురం ఎల్లగౌడ్ సూచించారు. బుధవారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వారు ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ, ప్రచార రథం ప్రారంభం తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతర ప్రాంగణం వద్ద పారిశుద్ధ్య, నీటి సరఫరా, చలువ పందిళ్లు తదితర పనులను త్వరితగతిన చేపట్టాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతర సమీపిస్తుండగా రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ పనులకు సహకరించాలన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతర ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్,నాయకులు, భక్తులు ఎండీ.మహిపాషా, ఐత వీరేశం, చట్ల రాజ్‌కుమార్, దాబా కరుణాకర్, పాలకుర్తి దేవస్థాన సూపరింటెండెంట్ వెంకటయ్య, రమేష్, అశోక్, ఓంప్రకాష్, యాకయ్య పాల్గొన్నారు.



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సై, ఈఓ, జాతర కమిటీ బాధ్యులు

సంక్షిప్త సమాచారం

బాబు డైరెక్షన్‌లో రేవంత్ నడవడమేంటి?

జనగామ: తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటని టీడీపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించే విషయంలో మొదటి నుంచి బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో బాబు పేరును ప్రస్తావించడం పద్ధతి కాదవన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విషయం తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీఆర్‌ఎస్ చేస్తున్న కుటిల పన్నాగాన్ని అన్ని వర్గాల వారు గమణిస్తున్నారన్నారు. అనవసరంగా బాబును విమర్శించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదన్నారు.

18 నుంచి కోలాట శిబిరం

లింగాలఘణపురం: జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి మార్చి 5వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, పరల్స్ ఆర్ట్స్ క్రియేషన్స్ సిద్దిపేట వారితో సంయుక్తంగా నిర్వహించే బోనాల కోలాట శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జయశ్రీ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ శిబిర సమన్వయకర్త ఒగ్గు రవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణను పూర్తి చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ మల్లికార్జున్, సూపరింటెండెంట్ సీతారామనాయుడు, కోలాట ట్రైనర్ సుంకరి శరత్, గౌరిగె నీల ఉన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం/జఫర్‌గఢ్/చిల్పూరు: ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్లలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో, జఫర్‌గఢ్, చిల్పూరు కృష్ణాజీగూడెంలో సీపీఎం, సీపీఐ నాయకులు వాల్ పోస్టర్లు, కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో నాయకులు వీరస్వామి, అంజయ్య, ఎల్లయ్య, యాదగిరి, సత్తయ్య, రామ్, జువారి రమేష్, ఎండీ యాకుబ్‌పాష, కాట సుధాకర్, ప్రజా సంఘాల బాధ్యులు, సాదం రమేష్, సాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నర్మెట: మండలకేంద్రానికి చెందిన ముక్కెర బాలరాజు ఇటీవల ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, స్థానిక ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ రూ. 5 వేలు, యాదవ యువసేన రూ. 5 వేలు, అమ్మ ఫౌండేషన్ మండల అధ్యక్షుడు మేకల రమేష్ రూ. 2 వేలు, ఎనుగుల వెలంగిణి రూ. 2 వేలు బుధవారం సాయం అందజేసి కుటంబ సభ్యులను పరామర్శించారు. యువసేన అధ్యక్షుడు ముక్కెర మహేందర్, ఉపాధ్యక్షులు నక్కల రవి, ముడికె సురేష్, సభ్యులు న్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

లింగాలఘణపురం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మరాఠి శ్రీకాంత్ (23) ఇటీవల ఆలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, 2013-2014 బ్యాచ్ పదో తరగతి మిత్రులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.25వేల సాయం అందజేశారు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని చిన్ననాటి స్నేహితులు ఓదార్చారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రాంమూర్తి, స్థానిక తహసీల్దార్ ఆంజనేయులు బుధవారం తెలిపారు. గత కొంత కాలం నుంచి ఆకేరు వాగు నుంచి జోరుగు ఇసుక రవాణా సాగుతున్నట్లు ఈ నెల 12న సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో ఆర్డీఓ తహసీల్దార్ కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ లాకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కేబుల్ చోరీ

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలో గుర్తు తెలియని వ్యక్తులు రైతుల వ్యవసాయ బావుల వద్ద కేబుల్ చోరీ పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గ్రామంలోని పెద్ద వాగు సమీపంలో గూడ సిద్దారెడ్డి, మ్యాక నర్సింహులు, పరిదె కొమురయ్య, పేరబోయిన వెంకటయ్య, తుప్పతి బాలయ్య, నర్ర కరుణాకర్‌రెడ్డి, కామిడి బాల్‌రెడ్డి, సత్తయ్య, మహేందర్ తదితర రైతులకు చెందిన బావుల వద్ద సుమారు రూ.లక్ష విలువైన కేబుల్ చోరీకి గురైనట్లు బాధిత రైతులు వాపోయారు. కాగా, కేబుల వైర్‌ను బచ్చన్నపేటలోని ఓ స్క్రాప్ షాపులో అమ్మినట్లు సమాచారం. ఈ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. మండలంలోని సాగరం, తిడుగు గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం, పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



పాలకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగమూర్తి, డాక్టర్ రవిరాథోడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, వైద్య సిబ్బంది అంజలి, రాపోలు వేణు, స్రవంతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు మండల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ అల్వాల ఎల్లయ్య తెలిపారు. బుధవారం కమిటీ ఎన్నుకున్న అనంతరం మాట్లాడుతూ గ్రామకమిటీ అధ్యక్షుడిగా ఘనపురం నాగేష్, ఉపాధ్యక్షులుగా నీల జంపయ్య, పిట్టల రాములు ప్రధాన కార్యదర్శిగా పుల్లం నాగభూషణం, యూత్ అధ్యక్షుడిగా నీల పవన్, కార్యదర్శిగా నీల కృష్ణ, మహిళా అధ్యక్షురాలిగా గంగరబోయిన రాజమ్మ, ప్రధాన కార్యదర్శిగా పుల్లం అంజమ్మతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

దేవరుప్పుల: వ్యవసాయంతోపాటు పిల్లల ఉన్నత చదువు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై చెన్నకేశవులు కథనం ప్రకారం మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గరిడె వెంకటేశ్వర్లు(49) తనకు ఉన్న తొమ్మిది ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే రెండేళ్లుగా పత్తి పంట ఆశించిన దిగుబడి రాలేదు. దీంతో పెట్టుబడుల కోసం తీసుకొచ్చిన అప్పులు పేరుకుపోయాయి. వీటితోపాటు ఇద్దరు కుమారుల ఉన్నత చదువు కోసం కూడా అప్పులు పెరగడంతో కొంత కాలం నుంచి మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమమంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించి కుటుంబీకులు జనగామలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అరవింద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుధవారం పేర్కొన్నారు.